
సాక్షి ఆదిలాబాద్

సోమవారం ၊ 10 ၊ ఏప్రిల్ ၊ 2023



నమాజ్ చేద్దాం రండి..!

ఇస్లాం సంప్రదాయంలో అత్యంత ముఖ్య భూమికను అజాన్ పోషిస్తోంది. అజాన్ అంటే నమాజ్ చేద్దాం రండి.. అని పిలవడం. అజాన్ చరిత్రపై ప్రత్యేక కథనం.. 8లో ▸




సైన్స్ ఒలింపియాడ్ స్కూళ్లు

ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ అధీనంలో సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ప్రవేశపరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.0 /26.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత అధికమవుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.



న్యూస్‌రీల్

నేడు కోవిడ్‌పై మాక్‌డ్రిల్

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో తీసుకున్న జాగ్రత్తలు, అవసరమైన చర్యలు, సదుపాయాలు, పడకలు, ఆక్సిజన్ వసతి, ఐసీయూ బెడ్లు, టెస్టింగ్ కిట్ల నిల్వ, మందులు తదితర వాటిపై డ్రిల్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తుగా డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిమ్స్‌లో 150 వెంటిలెటర్లు, ప్రతిబెడ్‌కు ఆక్సిక్లోమ్‌లు తది తర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రోగుల సంఖ్య పెరిగితే అవసరం మేరకు బెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

17నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సమస్యల సాధనకు ఈనెల 17నుంచి సమ్మె చేపడుతున్నట్లు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, కన్వీనర్లు జనార్దన్‌రెడ్డి, రమేశ్, గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని గాయత్రి గార్డెన్స్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యుత్ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

రేపు పూలే జయంతి

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 11న జిల్లా కేంద్రంలో మాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని అధికారికంగా నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని మాలీ కులస్తులంతా పూలే దంపతుల విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించే వేడుకలకు హాజరు కావాలని కోరారు. ముందుగా సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయ ఆవరణలోని పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ఆవరణలోగల జ్యోతిబాపూలే విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. తర్వాత జెడ్పీ సమావేశ మందిరంలో సభ ఉంటుందని వివరించారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, బీసీ, దళిత సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణేశ్, ఉత్తం, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



చర్చిలో భక్తి గీతాలాపన చేస్తున్న క్రైస్తవులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చిలలో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆరాధనలు నిర్వహించారు. ఏసు మార్గంలో నడవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని హోలీ ఫ్యామిలీ క్యాథడ్రల్ చర్చి, సీఎస్ఐ సెయింట్ పీటర్స్ చర్చి, బేయేర్షెబా చర్చిలలో క్రైస్తవుల తాకిడి కనిపించింది. కార్యక్రమాల్లో మత పెద్దలు శామ్యూల్, విజయలక్ష్మి, సూర్యకుమారి, కేఎస్ఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జూడాల సమ్మెబాట..!



- రేపటి నుంచి విధులకు గైర్హాజరు
- డైరెక్టర్‌కు సమ్మె నోటీస్ అందజేత
- ఎమర్జెన్సీ సేవలకు మాత్రం ఓకే..
- సమస్యల పరిష్కారం కోసమే స్ట్రైక్
- రిమ్స్‌లో రోగులకు తప్పని అవస్థలు

ఆదిలాబాద్‌టౌన్: రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు (జూడాలు) సమ్మెబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించనందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఈనెల 11నుంచి సమ్మెకు దిగుతున్నట్లు రిమ్స్ డైరెక్టర్‌కు నోటీస్ అందజేశారు. సోమవారం రాష్ట్ర నాయకులతో మరోసారి చర్చించి భవిష్యత్ ప్రణాళిక రూపొందించనున్నారు. కాగా, అత్యవసర సేవలు మినహా రెగ్యులర్ విధులకు హాజరుకాబోమని స్పష్టం చేస్తున్నారు. జూడాల సమ్మెబాట ప్రభావం రోగులపై పడనుంది. రిమ్స్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు, హౌస్‌సర్జన్‌లే ముందుండి రోగులకు సేవలందిస్తున్నారు. సీనియర్ వైద్యులు ఉన్నప్పటికీ చాలామంది మధ్యాహ్నమే ఇంటిబాట పడుతుండడంతో వీరే రోగులకు దిక్కవుతున్నారు. 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు.

ఎమర్జెన్సీ సేవలు మాత్రమే..

రిమ్స్‌లో 40 మంది జూనియర్ డాక్టర్లు పనిచేస్తున్నారు. వీరితో పాటు 120 మంది హౌస్‌సర్జన్లు, 100 మంది దాకా సీనియర్ వైద్యులున్నారు. ఇప్పటికే రిమ్స్‌లో ఖాళీల కొరతతో రోగులకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందకుండా పోతున్నాయి. దాదాపు 50కంటే ఎక్కువ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జూనియర్ డాక్టర్లు 24గంటల పాటు డ్యూటీతో పాటు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, గైనిక్ విభాగంలో సేవలందిస్తుండగా, ఈఎన్టీ, ఆప్తమాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ తదితర విభాగాల్లో ఆన్‌కాల్ డ్యూటీ కూడా నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోవడంతో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మెకు దిగనున్నారు. సోమవారం వరకు ప్రభుత్వం నుంచి స్పందన లేకపోతే మంగళవారం నుంచి ఆందోళనకు దిగనున్నట్లు స్పష్టం చేశారు.

అవస్థలు ఎదుర్కోనున్న రోగులు

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పేదలకు వరప్రదాయినిగా ఉన్న రిమ్స్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు సమ్మెబాట పడితే రోగులకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. సీనియర్ వైద్యులు ఉన్నప్పటికీ వారిలో చాలామంది ఉదయం 10గంటలకు విధులకు హాజరై మధ్యాహ్నమే ఇంటిబాట పడుతున్నారు. ఈ విషయం జిల్లా అధికారులతో పాటు రాష్ట్రస్థాయి అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన హౌస్‌సర్జన్లు, జూనియర్ డాక్టర్లతోనే కాలం వెల్లదీసే దుస్థితి నెలకొంది. మరోవైపు జూనియర్ డాక్టర్లు సమ్మె చేపడితే రోగులకు నామమాత్రంగా వైద్యసేవలు అందే పరిస్థితి. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం జూనియర్ డాక్టర్లు రిమ్స్‌లో అవుట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్, అత్యవసర సేవలతో పాటు సర్జరీలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సమ్మెకు దిగితే పేద ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకపోలేదు.

ఇవీ.. డిమాండ్లు

ప్రథమ సంవత్సరం జూనియర్ డాక్టర్లు 2022 నవంబర్‌లో విధుల్లో చేరారు. ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరం జూడాలకు డిసెంబర్ నుంచి వేతనాలు రావడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు వాపోతున్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు తాము డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రాం (డీఆర్పీ) విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారు. అయితే ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో మూడు నెలల పాటు ద్వితీయ సంవత్సరం తర్వాత విధులు కేటాయిస్తున్నారని, వసతి, భోజన సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో ఈ సౌకర్యాలు కల్పిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రతీ రెండేళ్లకోసారి జూనియర్ డాక్టర్లకు 15శాతం వేతనాలు పెంచాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జూడాలకు రూ.51వేల వేతనం చెల్లిస్తున్నారని చెబుతున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె



ప్రభుత్వం జూనియర్ డాక్టర్ల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 11నుంచి సమ్మె చేపడతాం. అత్యవసర విధులకు మాత్రమే హాజరవుతాం. ప్రథమ సంవత్సరం జూడాలకు ఆరు నెలల నుంచి వేతనాలు రావడం లేదు. ద్వితీయ, తృతీయ సంవత్సరం వారికి మూడు నెలల వేతనాలు రావాల్సి ఉంది. నిబంధనల ప్రకారం జనవరి నుంచి 15శాతం వేతనాలు పెంచాల్సి ఉండగా, ఇంతవరకు పెంచలేదు. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం డీఆర్పీ విధులు కేటాయించే సమయంలో భోజనం, వసతి కల్పించాలి. కానీ.. అలా జరగడం లేదు. దీంతో ఇబ్బందులకు గురవుతున్నాం. రోగులను ఇబ్బందులకు గురిచేయడం మా ఉద్దేశం కాదు. మా సమస్యల పరిష్కారానికే ఉద్యమం బాట పడుతున్నాం.

– అరుణ్, తెలంగాణ జూడాల సంఘం రిమ్స్ అధ్యక్షుడు

రోగులకు ఇబ్బందులు రానివ్వం



జూనియర్ డాక్టర్లు సమ్మె నోటీస్ ఇచ్చారు. వారు సమ్మెకు దిగినా రోగులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఆయా హెచ్‌ఓడీల ద్వారా సేవలందించే ఏర్పాట్లు చేస్తున్నాం. సోమవారం ప్రభుత్వంతో జూనియర్ డాక్టర్ల చర్చలు జరగనున్నాయి. సమావేశం అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటాం.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

రాంజీగోండ్ సేవలు మరువలేనివి

- కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్
- జిల్లా కేంద్రంలో ఘనంగా వర్ధంతి



రాంజీగోండ్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: గిరిజనుల హక్కుల సాధనకు పోరాడిన రాంజీగోండ్ సేవలు మరువలేనివని కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ కొనియాడారు. ఆదివారం రాంజీగోండ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధనకు పోరాడి ప్రాణాలర్పించిన రాంజీగోండ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాంజీగోండ్ పోరాట స్ఫూర్తితో ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ, జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారానికి పోలీస్‌శాఖ కృషి చేస్తుందని పేర్కొన్నారు. అంతకుముందు కలెక్టర్, ఎస్పీ, డీసీసీబీ చైర్మన్ ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదివాసీ సంఘాల నాయకులు సిడాం రాంకిషన్, మాజీ కౌన్సిలర్ మెస్రం కృష్ణ, గేడం మాధవ్, గేడం జనార్దన్, కిశోర్, రమేశ్, శంకర్, నాందేవ్, మెస్రం శంకర్, సనాతన హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి ఆనంద్‌రావ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలే బీఆర్‌ఎస్‌కు బలం'



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్, పక్కన ఎమ్మెల్యేలు సక్కు, రామన్న, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

నార్నూర్: ప్రజలు, పార్టీ కార్యకర్తలే బీఆర్ఎస్‌కు బలమని ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రైవేట్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా 500 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. కొమురంభీం, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ గెలుపునకు కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి మూడువేల డబుల్ బెడ్రూం ఇళ్లు అదనంగా ఇవ్వాలని సీఎంను కోరుతామని చెప్పారు. ఏజెన్సీ ప్రాంత దళితుల సమస్యలు తెలిపి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. దళితబంధు యూనిట్లు పెంచేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. సమ్మేళనంలో కుమురంభీం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, మాజీ ఎంపీ గోడం నగేశ్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, ఎంపీపీ కనక మోతుబాయి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు బానోత్ గజానంద్‌నాయక్, ఉర్వేత రూప్‌దేవ్, తొడసం నాగోరావు, అడే సురేశ్, యునుస్ అక్బాని, ఇంతియాజ్‌లాలా, కొర్రెళ్ల మహేందర్, కాంతారావు దుర్గే, దేవికాబాయి, మీరాబాయి, విద్యారాణి, హన్మంతరావు, సయ్యద్ ఖాశీం, రాథోడ్ రమేశ్, ఫిరోజ్‌ఖాన్, చంద్రశేఖర్, మాణిక్‌రావు, ప్రభాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిమ్స్‌కు 16 మంది సూపర్ స్పెషాలిటీ వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ఆస్పత్రికి త్వరలో 16మంది సూపర్ స్పెషాలిటీ వైద్యులు రానున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో రోగుల సంఖ్యకు అనుగుణంగా జిల్లా ప్రభుత్వ మెడికల్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ డాక్టర్లను నియమించనుందని పేర్కొన్నారు. వివిధ డిపార్ట్‌మెంట్లలో 16మంది సూపర్ స్పెషాలిటీ వైద్యులు సేవలందిస్తారని తెలిపారు. వీరి నియామకంతో పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నాణ్యమైన వైద్యం కోసం ఆయా ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లాలోనే మెడికల్ కళాశాల, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం గణనీయంగా పెరిగిందని వివరించారు.

ఇంద్రాదేవికి ప్రత్యేకపూజలు



ఇంద్రవెల్లి మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయానికి ఆదివారం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీలు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రవెల్లి మండలం మోదిగూడ, పొల్లుగూడ, పాకిడిగూడ తదితర గ్రామాల ఆదివాసీలు గావ్‌సాత్ పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరలోని పోచమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. సహపంక్తి భోజనాలు చేశారు. చైత్రమాసం ముగింపు వరకు పూజలు కొనసాగుతాయని ఆలయ మహరాజ్ చహకటి సూర్యరావ్ తెలిపారు. - ఇంద్రవెల్లి



ఆలయ ఆవరణలో నైవేద్యం వండుతున్న ఆదివాసీలు

'బలగం' చూపించుకున్నారు



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాపూరావ్



భరోసా సభలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

- బోథ్‌లో పోటాపోటీగా కార్యక్రమాలు
- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం
- ఎంపీపీ ఆధ్వర్యంలో మరోపేరుతో సభ
- అయోమయంలో బీఆర్ఎస్ కార్యకర్తలు

బోథ్: మండలంలో ఆదివారం నిర్వహించిన పోటాపోటీ కార్యక్రమాలు బీఆర్ఎస్‌లో వర్గపోరును బహిర్గతం చేశాయి. ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ ఆధ్వర్యంలో పొచ్చరలోని సాయి ఫంక్షన్‌హాల్‌లో 'ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించగా.. ఎంపీపీ తుల శ్రీనివాస్ స్థానిక పరిచయ గార్డెన్స్‌లో 'బీఆర్ఎస్ పథకాలతో భరోసా.. సీఎం కేసీఆర్ శ్రీరామరక్ష' పేరుతో మరో సభ నిర్వహించారు. ఎవరికి వారు సభలు నిర్వహించి తమ 'బలగాన్ని' చూపించుకున్నారు. పోటాపోటీగా కార్యకర్తలు, నాయకులను సభలకు రప్పించుకున్నారు. ఇది వీరిద్దరి మధ్య వర్గపోరును బహిర్గతం చేసింది. కాగా, ఉదయం 10 గంటలకు ఎంపీపీ తుల శ్రీనివాస్ తన అనుచరులతో కలిసి సభ నిర్వహించేందుకు పరిచయ ఫంక్షన్ హాల్‌కు చేరుకోగా గేటుకు తాళం వేసి ఉంది. ఇది ఎమ్మెల్యే అనుచరుల పనే అని ఆయన మండిపడ్డారు. చివరకు తాళం తీయగా సభ నిర్వహించారు. ఎంపీపీ నిర్వహించిన సభకు మాజీ ఎంపీ నగేశ్ వర్గీయులు పెద్దఎత్తున హాజరయ్యారు. దీంతో ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎంపీగా మారిపోయింది. ఫ్లెక్సీలో జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఫొటో పక్కన మాజీ ఎంపీ నగేశ్ ఫొటో వేయడంతో ఎంపీపీ శ్రీనివాస్ ఏర్పాటు చేసిన సభను మాజీ ఎంపీ నగేశ్ వెనుకుండి నడిపించారని పలువురు పేర్కొంటున్నారు. కాగా, బోథ్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపీ నగేశ్ బోథ్‌లో జరుగుతున్న రెండు సభల్లోనూ పాల్గొనకుండా నార్నూర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం చర్చకు తావిస్తోంది. కాగా, ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే చెప్పినట్లే వినాలి: ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్

నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెప్పినట్లు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వినాలని ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ సూచించారు. ఎమ్మెల్యే బాపూరావ్ ఏర్పాటు చేసిన ఆత్మీయసభకు హాజరై మాట్లాడారు. కొందరు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనకుండా వేరే సభ నిర్వహించడం సరికాదని, దీనిని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శమని, కార్యకర్తలు, నాయకులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలకు కార్యకర్తలను సిద్ధం చేయడానికే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మరో వారంరోజుల్లో ఇళ్ల నిర్మాణాలకు గైడ్ లైన్స్ వస్తాయని, అర్హులకు ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల సాయం అందిస్తామన్నారు. నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సభలో జెడ్పీటీసీ సంధ్యారాణి, ఏఎంసీ చైర్మన్ రుక్మన్‌సింగ్, బోథ్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఆత్మ చైర్మన్ సుభాష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆరే మా బాస్‌లు

- తుల శ్రీనివాస్, ఎంపీపీ

సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తామని, వారే మా బాస్‌లని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. పరిచయ గార్డెన్స్‌లో ఆదివారం 'బీఆర్ఎస్ పథకాలతో భరోసా–సీఎం కేసీఆర్ శ్రీరామరక్ష' పేరుతో సభ నిర్వహించారు. బోథ్ నియోజకవర్గంలో దళితబంధు, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపునకు కొందరు నాయకులు డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. వారి బాగోతాన్ని త్వరలోనే బయటపెడతామని, వారితో పార్టీకి చెడ్డపేరు వస్తుందని పేర్కొన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి తమకు సమాచారం ఇవ్వలేదని, కార్యకర్తలు, నాయకులపై కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. సంక్షేమ పథకాల పేరుతో కొందరు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ ముత్యంరెడ్డి ఆరోపించారు. ఈ విషయమై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సభలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు బండారి శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, నాయకులు నానం రమణ, తిరుమల్‌గౌడ్, రాజేశ్వర్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా వైఎస్సార్‌టీపీ

- పార్టీ కేబీ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్

నార్నూర్: సీఆర్ బిస్వాల్ కమిటీ ప్రకారం వెంటనే 1.91లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు రిలీజ్ చేయాలని, నిరుద్యోగులకు తమ పార్టీ అండగా ఉంటుందని వైఎస్సార్‌టీపీ కేబీ జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం గాదిగూడ మండల కేంద్రంలోని కొమురంభీం చౌక్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని కోరారు. టీఎస్‌పీఎస్సీ పేపర్లు లీక్ కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేపర్ల లీకేజీ వ్యవహారాన్ని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ.3,016 నిరుద్యోగ భృతి చెల్లించాలని, స్వయం ఉపాధి కల్పించాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా అర్హులకు రుణాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయంలో చోరీ



చోరీకి గురైన హుండీ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ భీమన్న ఆలయంలో చోరీ జరిగింది. ఆదివారం ఆలయానికి గ్రామస్తులు వెళ్లగా హుండీ పగులగొట్టి ఉంది. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

టిప్పర్ బోల్తా



కుంటాల వద్ద బోల్తాపడ్డ టిప్పర్

నేరడిగొండ: మండలంలోని కుంటాల(కె) గ్రామం వద్ద ఆదివారం టిప్పర్ బోల్తా పడడంతో ప్రమాదం తప్పింది. నిర్మల్ నుంచి కంకర లోడ్‌తో వెంకటాపూర్ గ్రామానికి వెళ్తుండగా కుంటాల ఘాట్స్ వద్ద బ్రేక్ ఫెయిల్ అయి జనావాసాలు ఉండే ప్రాంతంలో బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

కూచిపూడిలో సంధ్యకు నంది అవార్డు



అవార్డు తీసుకుంటున్న చిన్నారి సంధ్య

నిర్మల్‌టౌన్: శిఖరం ఆర్ట్స్ థియేటర్ గానసభ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం ఉగాది పురస్కారం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కూచిపూడి నాట్యంలో నిర్మల్‌కు చెందిన చిన్నారి పులి సంధ్యకు నంది అవార్డు అందుకుంది. సంధ్యకు నంది అవార్డు రావడం ఆనందంగా ఉందని తండ్రి వెంకటస్వామి అన్నారు.

టేకు చెట్లు నరికిన ఇద్దరి రిమాండ్



సబ్ జైలుకు తరలిస్తున్న పెంబి రేంజ్ ఫారెస్ట్ అధికారులు

పెంబి: టేకు చెట్లు నరికి అక్రమంగా తరలిస్తుండగా ఇద్దరి నిందితులను పట్టుకుని రిమాండ్ తరలించినట్లు ఎఫ్ఆర్‌వో రామకృష్ణ, డీఆర్‌వో ప్రతాప్ నాయక్ తెలిపారు. ఆరుగురు పరారయ్యారు. వారి కథనం ప్రకారం..పెంబి రేంజ్ పరిధిలోని దోందారి బీట్‌లో ఉట్నూర్ మండలం చిన్న గంగాపూర్‌లో 8 మంది నిందితులు 12 టేకుచెట్లు నరికిన దుంగలను ఉట్నూర్‌కు తరలిస్తున్నారని సమాచారం అందింది. తనిఖీ చేయగా ఆరుగురు పరారయ్యారు. ఇద్దరు నిందితులు టేకం దేవురావ్, ఆరే కన్నయ్యను పట్టుకుని ఆదివారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా..14 రోజులు రిమాండ్ నిమిత్తం నిర్మల్ సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. టేకు చెట్ల విలువ రూ.3 లక్షల55 వేలు ఉంటుందన్నారు. ఇందులో ఎఫ్ఎస్‌వో రవి, ఎఫ్‌బీవో రాజు, పెంబి రేంజ్ సిబ్బంది ఉన్నారు.

నమాజ్ చేద్దాం రండి..!



నమాజ్ చేస్తున్న ముస్లింలు (ఫైల్)

అజాన్ ఇస్తున్న ముస్లిం

కెరమెరి(ఆసిఫాబాద్): ఇస్లాం సంప్రదాయంలో అత్యంత ముఖ్య భూమికను అజాన్ పోషిస్తుంది. అజాన్ అంటే నమాజ్ చేద్దాం రండి అని పిలవడం. రోజుకు ఐదుసార్లు మసీద్‌ల నుంచి మైక్‌ల్లో ఈ పిలుపు వినపడగానే ముస్లింలు నమాజ్‌కు సన్నద్ధమవుతారు. అప్పటి వరకు చేస్తున్న పనులను పక్కనపెట్టి పవిత్ర హృదయాలతో మసీదుకు బయలుదేరుతారు. రోజు ఐదుసార్లు మసీదు నుంచి వెలువడే (దివ్య) వాణినే అజాన్ అంటారని ముస్లిం పెద్దలు చెబుతున్నారు. అజాన్ చరిత్రపై ప్రత్యేక కథనం!

- అజాన్‌కు ఘన చరిత్ర
- ప్రవక్త మెచ్చిన పిలుపు
- మసీదు నుంచి వెలువడే దివ్యవాణి
- రంజాన్ మాసం ప్రత్యేకం

అజాన్ ఇలా మొదలైంది..

మహ్మద్ ప్రవక్త, ఆయన అనుచరులు మక్కాలో ఉన్నంత కాలం తాము ఉంటున్న ఇంటిలోనే నమాజ్ చేసేవారు. అల్లా ఆజ్ఞ ప్రకారం మహ్మద్ ప్రవక్త మక్కా నుంచి మదీనాకు వలసవెళ్లారు. మదీనా చేరిన వెంటనే అక్కడ నమాజ్ చేయడానికి వీలుగా మసీదు నిర్మాణం చేపట్టారు. అయితే ముస్లింలను ఎలా ఆహ్వానించాలనే ప్రశ్న తలెత్తింది. శంఖం ఊదితే బాగుంటుందని కొందరు.. కాగడా వెలిగిద్దామని మరికొందరు తమ అభిప్రాయాలు వెల్లడించారు. అందులో అబ్దుల్లాబిన్ జైద్ వచ్చి ×నేను ఒక కల గన్నాను. నమాజ్ కోసం అందరిని పిలుస్తున్నా..₹ అని అజాన్ గురించి వివరించారు. ×అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్.. లాహిలాహి ఇల్లల్లాహి₹ అని ఆయన లయబద్ధంగా పాడి వినిపించారు. ఈ పదాలు ప్రవక్తకు నచ్చడం, అంతలోనే దైవవాణి (వహీ) కూడా అవతరించడంతో అబ్దుల్లాబిన్ జైద్‌కు వచ్చిన స్వప్నం నిజమని ప్రవక్త ధ్రువీకరించారు. మహ్మద్ ప్రవక్త జైద్‌ను పిలిచి అజాన్ పలుకులను హజ్రత్ బిలాల్ (రజీ) కు నేర్పించాలని సూచించారు. అలా మొదటి సారి అజాన్ హజ్రత్ బిలాల్ పలికారు. ఈ పిలుపు వినగానే ముస్లింలు నమాజ్ చేయాలనే ఉద్దేశంతో మసీదుకు తరలివచ్చారు.



ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు

నమాజ్‌కు రావాలనే భావన ఉంది.

అజాన్‌లో అల్లా గొప్పతనం, నమాజ్ ప్రాముఖ్యత ప్రధానంగా ఉంటుంది. దైవవాణి వినిపిస్తుంది. అందరూ నమాజ్ కోసం రావాలనే భావనను అజాన్ చెబుతుంది. రోజుకు ఐదుసార్లు అజాన్ ఉంటుంది. సూర్యోదయానికి ముందు చేసేదాన్ని ఫజర్ అని, మధ్యాహ్నం ఇచ్చే పిలుపును జోహర్ అని పిలుస్తారు. సాయంత్రం అసర్, సూర్యాస్తమయంలో మగరీబ్, రాత్రికి ఇచ్చే పిలుపును ఇషా అని వ్యవహరిస్తున్నారు. నమాజ్ కు ముందు అజాన్ ఇవ్వడం తప్పనిసరి. రంజాన్, బక్రీద్ పండుగలకు అజాన్‌లోని ముందు చరణాలను పలుకుతూ ముస్లింలు నమాజ్‌కు వెళ్తారు.

నమాజ్‌కు ప్రాధాన్యం..

నేరడిగొండ: రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు ఉండడమే కాకుండా నమాజ్ చదువుతారు. అల్లాహ్ దీవెనల కోసం ఐదుసార్లు నమాజ్‌తో పాటు తరావీ నమాజ్ (ఖురాన్ పఠనం) చేస్తారు. నమాజ్‌లో అల్లాహ్‌ను ప్రార్థించడమే కాదు.. సంపూర్ణ ఆరోగ్యం, క్రమ శిక్షణ కూడా అలవడుతుందని వారి నమ్మకం. నమాజ్ వెనుక దాగిన అసలు పరమార్థం ఇదేనని వారి విశ్వాసం. ముస్లింలు చేసే నమాజ్‌లో తక్బీర్, ఖియాం, రుకూ, సజ్దా, సలాం అనే క్రియలు ఉంటాయి. వాటితో ఎన్నో ఉపయోగాలున్నాయి.

'గిరి' గ్రామాల్లో సైన్స్ ఒలింపియాడ్ స్కూళ్లు

- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మంజూరు
- వచ్చే సంవత్సరం ప్రారంభం
- పాఠశాలల్లో ప్రవేశాలకు పరీక్ష నేడు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఉమ్మడి జిల్లాలో పరీక్ష రాసేవారు..

జిల్లా	ఆశ్రమపాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ఆదిలాబాద్	51	2040
ఆసిఫాబాద్	46	1840
మంచిర్యాల	16	640
నిర్మల్	17	680



ప్రశ్నపత్రాలతో సిబ్బంది

ఉట్నూర్: ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ ఆధీనంలో ఉమ్మడి జిల్లాలో ఎనిమిది సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలలు వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభం కానున్నాయి. బాల,బాలికలకు వేర్వేరుగా ప్రతి జిల్లాకు రెండు ఆశ్రమ పాఠశాలల చొప్పున 8 మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 4, 5, 6, 7, తరగతుల్లో ఒక్కో తరగతికి 40 మంది చొప్పున విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించే ప్రవేశపరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

ప్రతిపాదనలు సిద్ధం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 132 ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిల్లో దాదాపు 36 వేలకు పైగా గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో ఏయే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థుల ప్రవేశాలకు ఇబ్బంది లేకుండా ఎంపిక కోసం గిరిజన సంక్షేమ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది.

ఏర్పాట్లు పూర్తి



ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేశాం. 5200 మంది గిరిజన విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పకడ్బందీగా పరీక్ష నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– జగన్, ఏసీఎమ్‌వో, ఐటీడీఏ ఉట్నూర్

ప్రత్యేక బోధన..

ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలల్లో ఎంపికైన గిరిజన విద్యార్థులకు ప్రత్యేక విద్యాబోధన అందించనున్నారు. గణితం, సైన్స్, ఇంగ్లిష్ ప్రాధాన్యత గుర్తించి ప్రభుత్వం ఆయా అంశాల్లో వారిని తీర్చిదిద్దనుంది. ప్రస్తుతం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 4, 5, 6, 7 తరగతి చదువుతున్న విద్యార్థులకు సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రవేశపరీక్ష ఉంటుంది. మొత్తం 5,200 మంది పరీక్షకు హాజరుకానున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

భైంసా: బాసరలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

'అతిథులకు' జీతాల్లేవ్



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న గెస్ట్ లెక్చరర్

- ఆరునెలలుగా అందక ఇబ్బందులు
- కుటుంబ పోషణ భారం
- ఉమ్మడి జిల్లాలో 186 మంది గెస్ట్ లెక్చరర్లు

వివరాలు

జిల్లాలు	గెస్ట్ లెక్చరర్లు
నిర్మల్:	39
ఆదిలాబాద్:	53
కుమురంభీం:	40
మంచిర్యాల:	54
మొత్తం:	186

లక్ష్మణచాంద: ప్రభుత్వ కళాశాలలు ఉత్తమ ఫలితాలు వస్తున్నాయంటే అందులో అతిథి అధ్యాపకుల పాత్ర వెలకట్టలేనిది. రెగ్యులర్ లెక్చరర్ల మాదిరిగానే విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ వారి ఉన్నతికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గెస్ట్ లెక్చరర్లకు ఆరునెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు కాంట్రాక్టు అధ్యాపకుల బదిలీ ప్రక్రియ కొనసాగుతుండటంతో మూలిగే నక్కమీద తాటికాయ పడ్డచందంగా తయారైంది. 2013 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. గంటకు ప్రభుత్వం రూ.390 చెల్లిస్తోంది. వీరికి నెలకు గరిష్టంగా రూ.28,080 ఇస్తోంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో 186 మంది గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ సంబంధించి వేతనాలు విడుదల చేసింది. జూన్, నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు రావల్సి ఉన్నాయి. సకాలంలో వేతనాలు అందక వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల బదిలీ వల్ల నిర్మల్ జిల్లాలో ఇప్పటికే 6 గెస్ట్ లెక్చరర్లు ఉద్యోగాలు కోల్పోయారు. వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాలో ఖాళీ ఉన్నచోట గతంలో పనిచేసిన గెస్ట్ అధ్యాపకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని గెస్ట్ లెక్చరర్లు కోరుతున్నారు.

వేతనాలు విడుదల చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఆరునెలల నుంచి వేతనాలు రాలేదు. కుటుంబాలకు ఇబ్బందులు ఎదురువుతున్నాయి. ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలి. – జి. సాయినాథ్, గెస్ట్ లెక్చరర్ల సంఘం, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

కుటుంబ పోషణ భారం



నిర్మల్ జిల్లా ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నా. ఈ విద్యాసంవత్సరంలో జూన్, నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు రాలేదు. కుటుంబ పోషణ భారంగా ఉంది. అధికారులు త్వరగా వేతనాలు ఇప్పించాలి.

– ముత్యం, గెస్ట్ లెక్చరర్

సమస్య పరిష్కరిస్తాం



గతంలో జిల్లాలోని గెస్టు లెక్చరర్ల వేతనాలు డీఐఈవో కార్యాలయం నుంచి పంపేవారు. కాని ఇప్పుడు వారు పనిచేసే కళాశాలల ప్రిన్సిపాళ్ల నుంచి ఇస్తారు. రెండు రోజుల్లో వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.

– పరశురామ్, ఇంటర్ నోడల్ అధికారి

'అడెల్లి'లో భక్తుల సందడి



బాలాలయం ఎదుట దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సారంగాపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తుల సందడితో కిటకిటలాడింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచే కాక నిజామాబాద్, కరీంనగర్‌తోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నారు. నిర్మల్ డీఎస్పీ జీవన్ రెడ్డి కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. బాలాలయం ఎదుట ఇబ్బందులు లేకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణం జరుగుతుండటంతో భక్తులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.



డీఎస్పీ కుటుంబీకులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న అధికారులు

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

బెల్లంపల్లిరూరల్: కుటుంబ కలహాలతో వివాహిత ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. తాళ్ల గురిజాల ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం... బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన పందుల శేఖర్‌తో బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి రడగంబాల బస్తీకి చెందిన ముక్కెర లక్ష్మి అనే మహిళతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇటీవల శేఖర్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరుచుగా భార్యాభర్తలకు గొడవ జరుగుతుండేది. నిత్యం తాగివచ్చి భార్యతో గొడవ పడేవాడు. కొన్ని రోజుల క్రితం శేఖర్ హనుమాన్ మాల ధరించి శుక్రవారం విరమణ చేసిన మరుసటి రోజే మద్యంతాగి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. మత్తులో ఇంట్లోని టీవీ, సెల్‌ఫోన్ ధ్వంసం చేశాడు.

భరించే ఓపిక లేక ..

శేఖర్‌లో మార్పు రాక పోవడంతో పాటు మళ్లీ యథావిధిగా తాగడం మొదలుపెట్టడంతో లక్ష్మి తీవ్రమైన మానసిక వేదనకు గురైంది. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్రగాయాలైన లక్ష్మిని అదే రాత్రి బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతిచెందింది. ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. మృతురాలి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు

సిర్పూర్(టి): మండలంలోని కంచరపేట గ్రామంలో ఆదివారం తేనె టీగల దాడిలో ముగ్గురు గాయాలపాలయ్యారు. పోచమ్మ ఆలయానికి అమ్మవారి దర్శనం కోసం వెళ్లగా తేనె టీగలు దాడి చేయడంతో కొండబోని రమ పరుగెత్తడంతో కిందపడి కాలు విరిగింది. తిరుపతి, భీమయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

బావ బామ్మర్దులను వెంటాడిన మృత్యువు

- సారంగాపూర్ మండలంలో ఇద్దరూ మృతి
- గుడిహత్నూర్ మండలంలో బావ మృతి.. బామ్మర్దికి గాయాలు
- రెండు ప్రమాదాలు.. మూడు కుటుంబాల్లో విషాదం



నాందేవ్ మృతదేహం



శ్రీకాంత్ మృతదేహం

సారంగపూర్(నిర్మల్)/గుడిహత్నూర్(బోథ్): నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో మృత్యువు బావ బామ్మర్దులను వెంటాడింది. రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మహబూబాఘాట్స్ వద్ద జరిగిన ప్రమాదంలో బావ,బామ్మర్ది దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో బావ మృతిచెందగా, బామ్మర్ది తీవ్రంగా గాయపడ్డాడు. రెండు ప్రమాదాలు మూడు కుటుంబాల్లో విషాదం నింపగా, మృతులు ముగ్గురు ఆదిలాబాద్ జిల్లాకు చెందినవారే. ఇద్దరు ఇచ్చోడ మండలానికి చెందినవారు కాగా, ఒకరు జైనథ్ మండలానికి చెందిన వ్యక్తి. పోలీసులు, బంధువుల కథనం.. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా(బి) గ్రామానికి చెందిన బెండల్కర్ శ్రీకాంత్(36), జెక్తాఫ్ నామ్‌దేవ్(39) బావ, బామ్మర్దులు. ఇద్దరూ రోజు వారీ కూలీలుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారి సమీప బంధువు నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద ఆదివా రం పండుగ చేసుకున్నారు. వారి ఆహ్వానం మేరకు శ్రీకాంత్, నామ్‌దేవ్ బైక్‌పై అడెల్లికి వెళ్లారు. బంధువులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. తర్వాత అందరూ విందు చేసుకున్నారు. కార్యక్రమం అనంతరం బైక్‌పై తిరిగి ముఖరా(బి)కి బయల్దేరారు. మహబూబా ఘాట్స్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. శ్రీకాంత్, నామ్‌దేవ్ తీవ్రంగా గాయపడ్డారు. నామ్‌దేవ్ సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. శ్రీకాంత్‌ను స్థానికులు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. దీంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వెళ్లి మృతదేహాలను పరిశీలించి శ్రీకాంత్ తల్లి బెండల్క్ రుక్మిణీబాయికి సమాచారమిచ్చారు. ఆమె ఆస్పత్రికి చేరుకుని బోరున విలపలించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. బస్సును నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

44 నంబర్ జాతీయ రహదారిపై..



పెందూర్ స్వామి మృతదేహం

గుడిహత్నూర్ మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై వైజాపూర్ యూటర్న్ వద్ద ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్నాయి. బావ దుర్మరణం చెందగా, బామ్మర్ది గాయపడ్డాడు. జైనథ్ మండలం అడ గ్రామానికి చెందిన పెందూర్ స్వామి (25), ఆయన బామ్మర్ది మావల మండలం పల్లి(బి) గ్రామానికి చెందిన దుర్వ సుధాకర్‌తో కలిసి పల్లి(బి) గ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. సీతాగోంది గ్రామంలోని వైజాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద వీరు రోడ్డు క్రాస్ చేస్తుండగా, గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్‌కు బైక్‌పై వస్తున్న రాథోడ్ నరేందర్-అశ్విని దంపతులు ఢీకొన్నారు. ఈ ఘటనలో పెందూర్ స్వామి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నరేందర్-అశ్విని దంపతుల స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు సుధాకర్‌ను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా, నరేందర్-అశ్విని దంపతులకు స్థానికంగా చికిత్స చేయించారు. ఈ ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.